www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 12 అక్టోబర్ 2024
5
చిత్తూరు





ప్రయాణికులను దండం పెట్టి వేడుకుంటున్న ఎస్ఐ


తవ్వేయ్.. కోట్లు నొక్కేయ్..

యథేచ్ఛగా కొండలు, గుట్టల్లో తవ్వకాలు


ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగరి నియోజకవర్గ పరిధిలో కొండలు అధికంగా ఉండడం, ఇటీవల కాలంలో రోడ్లు, ఇతర నిర్మాణాలు పనులు ఎక్కువగా సాగుతుండడంతో అందుకు అవసరమైన కంకర, స్విచ్చు (20 ఎంఎం సైజు కంకర)కు మంచి డిమాండ్. రైల్వే పనులకు కూడా ఇక్కడ నుంచే కంకర వెళుతుంటాయి. ఇలా రోజు కొన్ని వందల టన్నుల కంకర అవసరం వస్తుండటంతో ఫ్యాక్టరీలు నిత్యం నడుస్తూ ఉన్నాయి.

రాత్రి, పగలు తేడా లేకుండ..

నగరి చుట్టు పక్కల ప్రాంతాల్లో సుమారు 15కిపైగా కంకర ఫ్యాక్టరీలు ఉన్నాయి. గుండ్రాజు కుప్పం, రామాపురం, అడవి కొత్తూరులో ఉన్న కంకర ఫ్యాక్టరీ నుంచి రోజుకి వందల సంఖ్యలో కంకర వెళ్తుంటాయి. ప్రధానంగా తమిళనాడు రాష్ట్రానికి ఇక్కడే నుంచి కంకర తరలిస్తారు. మన అవసరం కంటే ఇతర రాష్ట్రానికి ఎక్కువుగా అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు.




నగరి మండలం గుండ్రాజు కుప్పం వద్ద కొండను తవ్వేస్తున్న దృశ్యం



నగరి పట్టణం చుట్టు కొండలు, గుట్టలు దర్శనమిస్తున్నాయి. అయితే కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా కొండలు, గుట్టలను తవ్వేయడంతో కనుమరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే

కనుమరుగవుతున్న కొండలు గుట్టలు..

సగానికి పైగా కొండలు, గుట్టలు కరిగిపోయింది. మరో 20యేళ్లకి ఉన్న కొండలు కూడా కరిగిపోతాయేమోనని చెబుతున్నారు. రానున్న తారాలకు ఇలాంటి ప్రకృతి ఉందా అన్న సందేహం కలిగేలా ప్రస్తుతం పరిస్థితి ఏర్పడిందన్నారు.



కొండలను మింగినా.. కడుపు నిండదా..?

ఇప్పటికే నగరి ప్రాంతల్లో చాలా మంది వ్యాపారులు కొండలను పిండిచేసి కోట్లు సంపాదించారు. అయిన వారికి డబ్బు దాహం తీరలేదని, అందుకే ఇష్టారాజ్యంగా కొండలు తవ్వేస్తున్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాల్లో రాయితీ చెల్లించి కోట్లు దండుకొంటున్నారని, వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో అధికారులు నిద్రపోతున్నారని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇప్పటికైన ప్రకృతిని కాపాడుకోవల్సిన బాధ్యత అధికారులకు ఉందంటున్నారు.

అయ్యా.. మీకో దండం!

ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వారిని అడ్డుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: 'అయ్యా.. మీకో దండం.. కాస్త కిందకు దిగండి.. ఇలా ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగితే ఏంటి పరిస్థితి.. ముందువెనుక ఆలోచించుకోరా..' అని టాటా ఏసీ వాహనంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎస్ఐ రాజ్‌కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్వేటినగరం మండలంలో పుత్తూరు – చిత్తూరు రహదారిపై శుక్రవారం ఎస్ఐ రాజ్‌కుమార్ వాహన తనిఖీలు చేపట్టారు. కొల్లాగుంట గ్రామం వద్ద ఓ టాటా ఏసీ వాహనంలో అధిక సంఖ్యలో ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణిస్తున్న వారిని గుర్తించి ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. చేతులు జోడించి దండం పెట్టి మరీ వారిని అలా ప్రమాదకర ప్రయాణం చేయొద్దని వేడుకున్నారు. టాటా ఏసీ డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

'విజయదశమి శుభాకాంక్షలు'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విజయానికి ప్రతీక దసరా పండుగ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయ దశమి. అదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విజయాలు సాధించాలని ఆ దుర్గా దేవి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి నిండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో సిరిసంపదలతో తుల తూగాలని కోరుకుంటున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి విద్యాధరి, డీఆర్‌వో పుల్లయ్య, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. జిల్లా ప్రజలకు వేర్వేరు ప్రకటనలతో విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

అశ్వ వాహనంపై 'కల్కి'



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం రాత్రి అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. ఉదయం వేడుకగా రథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రికి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె. శ్యామలరావు ఆదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-రామకుప్పం: సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 15న రామకుప్పం మండల పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా ముందస్తు ఏర్పాట్లును ప్రజా ప్రతినిధులు, అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని గాంధీనగర్, మొద్దుల వంక గ్రామాల్లో పర్యటించి మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. దీంతో కార్యక్రమానికి విచ్చేయనున్న టిడిపి నేతలు, కార్యకర్తలు, మహిళలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజుల పరిపాలన, ఇది మంచి ప్రభుత్వంపై ప్రజలతో ముఖాముఖి మాట్లాడుతారన్నారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఇన్‌ఛార్జ్ ఎస్ఐ నరేష్, నాయకులు మునస్వామి, నారాయణ చారి, ఆనంద రెడ్డి, రామ్మూర్తి, కృష్ణానాయక్, చంద్రారెడ్డి, నాగభూషణం, సత్తి, విశ్వనాథ్, వెంకటరమణ, మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక



సర్టిఫికేట్‌లు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అండర్-15 జిల్లా జట్టులను ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు యుఆర్‌బి ప్రసాద్ తెలిపారు. జిల్లా చెస్ పోటీల జట్టును పట్టణంలోని తూర్పు మొగసాలలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పుంగనూరు నోబుల్ ప్రోత్సాహంతో గురుకులం చెస్ క్లబ్ సంయుక్తంగా పోటీలు నిర్వహించాయి. అండర్ 15 జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నవ్యశ్రీ 9వ తరగతి, రోహిత 6వ తరగతి, సాయి నవ్యశ్రీ, 8వ తరగతి, జాహ్నవి, 8వ తరగతి, గూడూరు పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సతీష్, 8వ తరగతి, గౌతమ్, 7వ తరగతి, హరీష్ నాగ, 8వ తరగతి, కొత్త ఇండ్లు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి వినయ్ కుమార్, 9వ తరగతిలు ఓపెన్ విభాగంలో గెలుపొందారు. వీరు ఈనెల 15 నుంచి 17 వరకు గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. జిల్లా జట్టుకు ఎన్నికైన విజేతలకు మెడల్స్, సర్టిఫికేట్‌లు అందజేసి అభినందించారు.

ముగిసిన మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ

- జిల్లాలో 104దుకాణాలకు 2240 దరాఖాస్తులు
- అత్యధికంగా పాలసముద్రం మండలానికి 82 దరఖాస్తులు
- జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.44.80కోట్ల ఆదాయం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీలో భాగంగా శుక్రవారం నాటికి టెండర్ల ప్రక్రియ ముగిసింది. జిల్లాలో 104 దుకాణాలకు ఈ నెల 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందజేశారు. అందుకోసం ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తంగా 104దుకాణాలకు గానూ 2240దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా పాలసముద్రం మండలంలో 82దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. మొత్తంగా జిల్లా నుంచి టెండర్ల డిపాజిట్ సొమ్ముతో ప్రభుత్వానికి రూ.44.80కోట్లు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

రెండు రోజుల్లో పెరిగిన దరఖాస్తులు

ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకూ టెండర్ దరఖాస్తులు పూర్తి కావాల్సి ఉండగా ప్రభుత్వం మరో రెండు రోజుల గడువు పొడిగించింది. శుక్రవారం వరకూ దరఖాస్తులు స్వీకరించారు. కాగా పొడిగించిన రెండు రోజుల వ్యవధిలోని జిల్లాలో 633 టెండర్ దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

దుకాణాలు ఎక్కడెక్కడంటే..

జిల్లాలో 104 మద్యం దుకాణాలకు అనుమతులిచ్చారు. అందులో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 14, మున్సిపాలిటీల పరిధిలో 23, మండలాల్లో 67దుకాణాలకు టెండర్ దరఖాస్తులు ఆహ్వానించారు. వాటిలో జనాభా నిష్పత్తి ప్రకారం ఏడాధిలో రూ.55లక్షల వ్యాపారం జరిగే షాపులు 34, రూ.65లక్షల వ్యాపారం జరిగేవి 70 షాపులను గుర్తించారు. పోటాపోటీగా టెండర్ కైవసం చేసుకోవడానికి ఆశావహులు ఆసక్తి చూపారు.

14న లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు

జిల్లాలో వివిధ చోట్ల నుంచి అందిన దరఖాస్తులను ఈనె 14వ తేది పరిశీలించి లాటరీ పద్ధతిలో అధికారులు దుకాణాలు కేటాయించనున్నారు. లాటరీ నిర్వహణ కోసం చిత్తూరు సహకార షుగర్ ఫ్యాక్టరీని ఎంపిక చేశారు. అనివార్య కారణాలంటూ సంతపేటలోని ఆర్ఆర్ గార్డన్స్‌కు మార్పు చేశారు. మద్యం దుకాణాల టెండర్ల గడువు పెంపు, వెన్యూ మార్పుతో గంధరగోళం నెలకొంది.

కన్నతల్లి మందలించిందని..!

చిల్లకూరు మండలంలో దారుణం



ప్రజాశక్తి – చిల్లకూరు

కన్న తల్లి సుశీలమ్మ (45) మందలించిందన్న కోపంతో కొడుకు మనోజ్ (23) కర్రతో తల పగలగొట్టిన దారుణ ఘటన తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం కమ్మవారిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించగా శుక్రవారం ఆమె మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిని బాగా చూసుకోవాల్సిన కొడుకు దారుణానికి ఒడిగట్టాడు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తల్లి సుశీలమ్మ మందలించడంతో విచక్షన కోల్పోయిన మనోజ్ క్రూరమృగంలా కర్రతో తలపై కొట్టాడు. వైద్యం కోసం సుశీలమ్మను గూడూరుకు, తరువాత నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. చిల్లూకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధరల మంట.. పండగ ఎట్లా..!

- భారంగా నిత్యావసరాలు
- దసరాకు ఉడకని ప్రసాదాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దసరా అంటే నవరాత్రులు.. ప్రతిరోజూ తొమ్మిది రకాల ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టడం భక్తుల ఆనవాయితీ. మరికొందరు రోజుకో రకం ప్రసాదంతో అమ్మవారికి నైవేద్యం అందిస్తున్నారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు శక్తి స్వరూపిణికి సమర్పించే నవ నైవేద్యాలకూ ధరాఘాతం తప్పడం లేదు. ఇపుడే కాదు, గత రెండేళ్లుగా ధరలు ఆకాశంలోనే ఉన్నాయి. దీంతో సామాన్యులు పండుగలకు దూరమవుతున్నారు.

నవరాత్రుల్లో మొదటిరోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి బెల్లం పొంగలిని నైవేద్యంగా పెట్టారు. రెండోరోజు గాయత్రీ దేవికి ఉడకబెట్టిన పెసలు, పెసరపప్పు పొంగలి, పులిహోర.. మూడోరోజు అన్నపూర్ణకు దద్దోజనం, పాయసన్నం, పొంగలి, కొబ్బరి అన్నం పెట్టారు. ప్రస్తుతం 8వ రోజు దుర్గాదేవిగా అలంకరించి పాయసం, చక్కెర పొంగలి పెట్టారు. శుక్ర వారం మహిషాసుర మర్ధినిగా వడపప్పు, పానకం, పులిహోర, పాయసన్నం.. శనివారం రాజరాజేశ్వరీ దేనికి పాయసన్నం, పులిహోర, కొబ్బరి, అరటి సమర్పిస్తారు. నైవేద్యానికి వాడే వస్తువులన్నింటి ధరలు ప్రస్తుతం కొండెక్కి కూర్చొన్నాయి.

ఉట్టెక్కిన పూజా సామాగ్రి

ప్రజాశక్తి - వెంకటగిరి, డక్కిలి

దసరా పండుగ అంటేనే వ్యవసాయ పనిముట్లు, వాహనదారులు తమ వాహనాలకు,పోలీసులు ఆయుధాలకు, విద్యార్థులకు పుస్తకాలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పూలు, పండ్లు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు ఖచ్చితంగా పూజకు కావాల్సిందే. అయితే పెరటాసి నెల కావడంతో ఈ నెలంతా వీటి ధర అధికంగానే ఉంటుంది. ప్రస్తుతం దసరా సందర్భంగా వీటి ధర రెట్టింపయ్యింది. పూలు, పండ్లు, పూజాసామాగ్రి కొనేందుకు వచ్చిన వారితో వెంకటగిరిలోని మార్కెట్ సందడిగా ఉంది. పండగ నేపథ్యంలో పూల ధరలను వ్యాపారులు అమాంతం పెంచేశారు. రెండు రోజుల క్రితం వరకూ కిలో రూ.50 పలికిన బంతిపూలను కిలో రూ.100కి పైగా అమ్మారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో పట్టణములోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం , కాత్యాయని దేవి ఆలయం , కాళికామాత ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. గతంలో దసరా పండుగ అంటే ఓ పక్క బొమ్మల కొలువులు, పట్నం నుంచి పల్లెలకు చేరే జనాలతో సందడిగా ఉండేది. దసరా మామూళ్ల కోసం వచ్చేవారు. పులి వేషాలు వేసేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే దసరా అంటే ఉల్లాసంగా ఉండేది. ప్రస్తుతం ఆధునిక యుగంలో సోషల్ మీడియాలోనే గ్రీటింగ్స్ తెలుపుకుంటున్నారు. పూజలు చేసి నైవేద్యాలు తిని, సెలవులను ఎంజాయ్ చేసే పరిస్థితి.

ఈ మూడేళ్లలో ప్రతి సెప్టెంబరులో ధరలిలా..(రూపాయల్లో)

సరుకులు (కేజీ)	2022	2023	2024
బియ్యం గ్రేడ్ 1	52.4	58	62
బియ్యం గ్రేడ్ 2	37.98	40	41
గోధుమ	39.60	41	43
కందిపప్పు	120	170	172
పెసరపప్పు	101	116	117
మినపప్పు	101	112	121
శనగ	71	82	107
వేరుశనగ	108	150	170
పసుపు	225	243	260
కారం	310	361	380
బెల్లం	-	47	53

వైద్యుల తీరుపై ఎంపీ ఫైర్

- సంతకాలు చేసి విధులకు డుమ్మా కొట్టడంపై ఆగ్రహం
- ఆకస్మికంగా ఆసుపత్రి తనిఖీ చేసిన ఎంపీ
- రిజిస్టర్ తనిఖీల్లో వైద్యులు, సిబ్బంది డుమ్మా కొట్టినట్లు గుర్తింపు
- బాధ్యతారాహిత్యం అంటూ వైద్యులపై మండిపాటు
- తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక



ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల తీరుపై చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసి విధుల్లో లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఎస్ఆర్ పురం మండల ఆరిమాకుల పల్లెలోని ఆరిమానిగంగమ్మ ఆలయానికి ఆయన విచ్చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం అక్కడి నుంచి ఆరిమాకులపల్లె ఆసుపత్రిలో తనిఖీ చేపట్టారు. అక్కడ వైద్యులెవరూ లేకపోవడాన్ని గమనించారు. రిజిస్టర్ పరిశీలించారు. సంతకాలు చేసిన వైద్యులు, సిబ్బంది విధులకు డుమ్మాకొట్టినట్లు గుర్తించారు. ఆసుపత్రిలో పనితీరు, అక్కడి పరిస్థితిని, పరిసరాలను తనిఖీ చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వైద్యుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహించారు. తీరుమార్చుకోకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్కడి నుంచి ఎస్ఆర్ పురం మండల కేంద్రంలోని ఆయుష్మాన్ భవ ఆరోగ్య కేంద్రానికి చేరుకొని తనిఖీ చేపట్టారు. అక్కడ వైద్యాధికారులు, వైద్యులతో సమావేశం అయ్యారు. ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వైద్యులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ప్రసాదరావు సానుకూలంగా స్పందించారు. ఆసుపత్రిల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు వసతి సౌకర్యాలను కూడా కల్పించేందుకు ప్రభుత్వం ముందుంటుందని, దీన్ని వైద్య అధికారాలు సద్వినియోగం చేసుకొని ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై పర్యవేక్షించాలని తహశీల్దార్ లోకనాథ పిల్లైకి సూచించారు.

అన్నదానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎండి శ్రీధర్ రెడ్డి శుక్రవారం రోగులకు అన్నదానం చేపట్టారు. తోడ్పాటు అందించిన డాక్టర్ దుర్గాదేవి, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సదుంలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-సదుం: మండల పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. సుమారు 4గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు లేకుండా అరగంట పాటు వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండలకు విపరీతమైన ఉక్కపోత నుంచి ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. గ్రామీణ ప్రాంత రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సదుంలో శుక్రవారం వారపు సంత కావడంతో వ్యాపారస్తులు, రైతులు కొంత ఇబ్బంది పడ్డారు. పట్టణంలో రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

నీటి సమస్యకు పరిష్కారం



బోరు పనులను పరిశీలిస్తున్న గిరిప్రసాద్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం మండలం గుడ్లనాయనపల్లి గ్రామంలో సర్పంచ్ ఝాన్సీరాణి గిరి ప్రసాద్ ప్రభుత్వ బోర్లకు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా వర్షాలు లేక నీటి ఎద్దడి ఏర్పడి గ్రామ ప్రజలు సమస్యను ఎదుర్కొంటున్నట్టు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. సమస్యలు గుర్తించి వెంటనే ప్రభుత్వ బోర్లలో అదనపు పైపులు దించి నీటి సమస్యకు పరిష్కారం చూపడం జరిగిందన్నారు.

ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా శ్రీధర్



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో శివశంకర్ బదిలీపై పీలేరుకు వెళ్లారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న శ్రీధర్ ఇన్‌ఛార్జ్ ఎంపిడివోగా బాధ్యతలు చేపట్టారు.

అభివృద్ధే అజెండా..

- టీడీపీ నేత పోటుగారి గంగయ్య



పారిశుధ్య పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే అజెండాగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందని జీడీ నెల్లూరు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మొండివెంకనపల్లిలో పారిశుధ్య పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీ నుంచి ప్రభుత్వం చేపట్టదలచిన 'పల్లె పండుగ'ను ఘనంగా నిర్వహిఒంచేందుకు ప్రజల సహకారం కావాలన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, జనసేన నాయకులు సతీష్, హరినాథ్, లోకేష్ రెడ్డి, మధు, తిరుమలయ్య, వాసు, వెంకటస్వామి, తంగరాజు జీవా, ఉమేష్ పాల్గొన్నారు.

వెంకటేష్‌కి నివాళి



ప్రజాశక్తి-రామకుప్పం: టిడిపి సీనియర్ నేత, కొంగణపల్లి మాజీ ఎంపీటీసీ వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం ఆయన భౌతిక గాయానికి టిడిపి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అభివృద్ధి పథకాలు అందించి, పార్టీకి ఎనలేని సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నియోజకవర్గస్థాయిలో సుపరిచితులైన వెంకటేష్ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ విస్తరణ సభ్యుడు డాక్టర్ సురేష్ బాబు, మునస్వామి, ఆనందరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, చిన్నకృష్ణ, చలపతి, కన్నన్, నాగభూషణం, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: తిరుపతి లోని అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం లోని రాజుల కండ్రిగ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మడిబాక, ఎండి పుత్తూరు, సదాశివ పురం, కందాడ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డీవోపీ కేశవ ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు రాజేష్ మార్కెటింగ్, ప్రియా ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో దాదాపు 70 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలి పా రు. సోమవారం పది మందికి శుక్లం ఆపరేషన్లు చేసి పంపుతామని వైద్యులు తెలిపారు.

ఘనంగా పెద్దిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టిన రోజు వేడుకలను కుప్పం పురపాలక సంఘం అధ్యక్షులు డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పెద్దిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


చౌడేపల్లి: మండల కేంద్రమైన చౌడేపల్లిలో శుక్రవారం మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కమల ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆ తరువాత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దామోదర్ రాజు, అంజిబాబు, నరసింహులు యాదవ్, రుక్మిణమ్మ, శంకర్ నారాయణ, పవన్ రాయల్, హరీష్ రాయల్, సర్పంచ్ శ్రీరాం భరత్, వరుణ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మాజీ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మ తనయుడు డాక్టర్ ఆనగంటి హరికృష్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మాజీ మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బైరెడ్డిపల్లి: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి తనయులు రాజు, చెట్కలేష్, ఎంపీటీసీలు అన్నదానం చేపట్టారు.



కుప్పంలో



చౌడేపల్లిలో

సదుం: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 72వ జన్మదిన వేడుకలను శుక్రవారం సదుంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సదుం బస్టాండ్ కూడలిలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ చేసి, అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, ఇన్‌ఛార్జ్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, నాయకులు అమరావతి పుత్రాజ్, ఉషారాణి, బాబు రెడ్డి, పెద్దిరెడ్డి రమేష్ రెడ్డి, మోహన్ రెడ్డి, శివారెడ్డి, షబ్బీర్, వెంకటరమణ, అన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను పుంగనూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లో వైసిపి మున్సిపల్ చైర్మన్ హలీం బాషా, మండల ఎంపీపీ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు కౌన్సిలర్లు సర్పంచులు ఎంపిటిసిలు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వైయస్సార్ విగ్రహం ఎదుట భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప హాజరైయ్యారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, షరీఫ్, జయరాం, చెంగారెడ్డి, అమరేంద్ర, జయరాం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రాజేష్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-రామకుప్పం: కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి పూర్తి స్థాయిలో సాధ్యమవుతుందని టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉన్సిగాని పల్లి పంచాయతీ జౌకుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలతో పాటు గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. వీధి దీపాలు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుధ్యం తదితర పనులను వెంటనే పర్యవేక్షించాలన్నారు. మారుమూల గ్రామానికి కూడా సిమెంట్ రోడ్డు నిర్మాణం వేయడం



జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూడా ముందు చూపుతో చంద్రబాబు విజన్‌తో రాష్ట్ర పరిపాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, నారాయణ చారి, ఆనంద రెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, కన్నన్, నాగభూషణం, మహాదేవి, జయశంకర్, విశ్వనాథ్, మహేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్, డంపింగ్ యార్డ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గోడలే పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలో ఇసుక రీచ్ ను, డంపింగ్ యార్డును క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుకను తరలించే సమయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ శ్రీనివాస కుమార్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కే ప్రభాకర్ రావు, స్థానిక తహశీల్దారు కటారి జయజయరావు,



ఇసుక రీచ్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

డిప్యూటీ తహశీల్దారు అజమత్ ఖాన్, విఆర్ఓ సాయి శరణ్య, కృష్ణ, విలేజ్ సర్వేయర్ మహేష్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, స్థానిక టిడిపి నాయకులు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, లక్కు రఘునాథరెడ్డి ఉన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అనుసరించి ఎక్సైజ్ శాఖ ప్రైవేటు మద్యం షాపులకు ధరఖాస్తులను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలో పురపాలక సంఘం పరిధిలో 5, గుడుపల్లి మండల పరిధిలో 1, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో ఒక్కొక్క మండలానికి 2 దుకాణాల చొప్పున ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రభుత్వ సూచనల మేరకు శుక్రవారం గడువు మీరుతున్న సందర్భంగా సాయంత్రం 6:25 గంటలకు పరిధిలో



కుప్పం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నాగరాజ

మొత్తం 312 దరఖాస్తులు అందినట్టు ఎక్సైజ్ సీఐ నాగరాజా తెలి పారు. ఇందులో పట్టణ పరిధి లో ఐదు షాపులకు గాను 16 1, గుడుపల్లి మండల పరిధిలో ఒక్క షాపుకు గాను 39, శాంతిపురం మండల పరిధిలో 2 షాపులకు గాను 73, రామ కుప్పం మండల పరిధిలో 2 షాపులకు గాను 39 దరాఖాస్తులు వచ్చాయని, ఇవి ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులు సోమవారం ఉదయం 7 గంటలకు చిత్తూరు సంతపేటలోని ఆర్‌ఆర్ గార్డెన్స్ వద్దకు చేరుకోవాలని సూచించారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్‌లు

- నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగరి పట్టణంలో ఎమ్మెల్యే భాను ప్రకాష్ శుక్రవారం అన్న క్యాంటీన్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు రు.5 లకే కడుపునిండా భోజనం పెట్టే అన్న క్యాంటీన్ పథకం ఏపీలో ప్రారంభించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. నగరిలో అన్న క్యాంటీన్ పునః ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో పేద ప్రజలు పూటకు రు.5 చొప్పున మూడు పూటల నాణ్యమైన భోజనం తినే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు.



రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అనేక, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ కృష్ణారెడ్డి, నాయకులు ఉమాపతి రాజు, నారాయణస్వామి, ధనుంజయ రాజు, బాలాజీ, శివ, మణి, అలీముత్తు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినీత్‌కు పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి నగరి నియోజక వర్గ పుత్తూరు పట్టణ ముద్దుకృష్ణాపురానికి చెందిన నాయకురాలు నాగరత్నం రెండవ కుమారుడు వై వినీత్ రెండు రోజులు క్రితం ద్విచక్ర వాహనంలో వెళుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వై వినీత్ ను శుక్రవా రం ముద్దుకృష్ణాపురంలోని ఆమె ఇంటికి వెళ్లి ఆయన



ప రా మ ర్శిం చా రు. ప్రమాదంలో పాడైన ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. చికిత్సకు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ తన పెద్ద కుమారుడు కౌశిక్ డిగ్రీ చదివి నిరుద్యోగిగా వున్నాడని, ఉపాధి కల్పించాలని విజయ్ బాబును కోరారు. స్పందించిన విజయ్ బాబు ఆమె కుమారు డికి ఉద్యోగం ఇప్పిం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. టిడిపి కార్యకర్తలు ఎవరైనా సమస్యతో తన వద్దకు వస్తే తాను వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపిటిసి, శ్రీజ బాలాజీ నాయుడు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇ రవి నాయుడు, మాజీ ఎంపిటిసి పాండురంగయ్య , ఇతర నాయకులు దాసరి విజయ్ చౌదరి, హెచ్ సుబ్రమణ్యం, అరవ ప్రకాష్, పరంధామయ్య, సారథి, కుమార్ రెడ్డి, పోతుగుంట రమేష్ పాల్గొన్నారు.

క్వారీకి అనుమతి

- ప్రజాభిప్రాయ సేకరణకు తిలోదకాలు

- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి - ఓజిలి: ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోకుండా అధికారులు క్వారీకి యథేచ్ఛగా అనుమతులు ఇవ్వడంపై గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరిమానుపాడు గ్రామంలో సర్వేనెంబర్ 65 కొండ పోరంబోకు భూములలో గ్రావెల్ మెటల్ కోసం ఓ సంస్థ సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వ అధికారులు ఈ సంస్థకు అనుమతులు ఇచ్చే విషయం గురించి బహిరంగంగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజాభిప్రాయ సేకరణలో ఇక్కడ క్వారీ ఏర్పాటు చేయడంపై ఆరిమానుపాడు పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. క్వారీ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పశువులకు మూగజీవాలకు మేత సమస్య ఏర్పడుతుందని. మనుషులకు కూడా ప్రాణాపాయం కగులుగుంతని అధికారుల ముందు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కానీ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా క్వారీకి అనుమతులు ఇవ్వడంపై గ్రామస్తులు అధికారుల మీద మండిపడుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక గ్రామస్తుల సంతకాలు పెట్టకపోవడంతో పక్క మండలానికి చెందిన గ్రామస్తులతో సంతకాలు తీసుకొని అడ్డదారిలో అనుమతులు పొందుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అవసరం అయినప్పుడు వారి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఎలా అనుమతులు ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. క్వారీ నిర్వహకులు 2022వ సంవత్సరంలో అనుమతులు పొందినప్పుడు పనులు చేయకుండా ఇప్పుడు పనులు చేయడంలో గల ఆంతర్యం ఏమిటని?



ప్రజాభిప్రాయం లేకుండా అధికారులు అనుమతి ఇచ్చిన క్వారీ ఇదే..

ప్రశ్నిస్తున్నారు. అనుమతులు పొందినప్పుడు ఎందుకు పనులు చేయలేదు ? ఇప్పుడు ఎందుకు పనులు చేస్తున్నారో అన్న విషయాన్ని కూడా వారు స్పష్టంగా తెలియజేయాలని ఇటీవల గ్రామస్తులు రెవెన్యూ అధికారులను నిలదీస్తూ నిరసన తెలిపారు. అధికారుల చేతివాటం పై గ్రామస్తులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై రాజకీయ కోణం అంతరించుకోవడంతో . ప్రజలకు వ్యతిరేకంగా క్వారీ నిర్వహణ చేపట్టాలని క్వారీ యాజమాన్యం అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో బహిరంగంగా ప్రజా అభిప్రాయ సేకరణ సేకరించాలని స్థానిక గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

రతన్ టాటాకు నివాళులు

ప్రజాశక్తి- తిరుపతి: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా సేవలు భారతదేశానికి రత్నాలు లాంటివని శ్రీ లక్ష్మీ దీన దయాల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దీన దయాల్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రతన్ టాటా చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. దీనదయాల్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్రాజు సుకుమార్ రాజు మాట్లాడుతూ సేవలకు మానవత్వం ముఖ్యమని పేర్కొన్నారు. రతన్ టాటా సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా శుక్రవారం రథోత్సవం అధిరోహించగా నారాయణుడు పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ కెఎస్ వాసు, అమృతవల్లి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుమిత్రా శ్రీధర్, ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.


బంగారుపాళ్యం: దేవీ నవరాత్రుల పురస్కరించుకొని 9వ రోజు మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలిసియుండు శ్రీ కామాక్షి సమేతంగా మొగిలిశ్వర స్వామి ఆలయంలో లలిత సహస్రనామం కుంకుమార్చన కార్యక్రమం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి సుందరంగా



బైరెడ్డిపల్లిలో

అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని టీ.గడ్డురు గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ సల్లాపురమ్మ దేవస్థానంలో శుక్రవారం విజయమ్మ, మునికృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా కళాతరంగిని వారిచే నిత్య పోటీలు కోలాటాలు, చెక్కభజనను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.



జీడీ నెల్లూరులో

సల్లాపురి గంగమ్మ

విజయపురం: మండలంలోని జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో శుక్రవారం దుర్గాదేవీ పూజలు ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవీని ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు రాంప్రసాదశర్మ తీర్థప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-రామకుప్పం: పలమనేరు- కుప్పం జాతీయ రహదారి సమీపంలోని బూదుగూరుపల్లి గ్రామం వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనం, బొలెరో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం నుంచి బొలెరో వాహనం వస్తుండగా బూదుగూరుపల్లికి వద్ద ద్విచక్ర వాహనంలో వస్తున్న గంగప్ప(60)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న గంగప్ప తీవ్ర గాయాలతో సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన ఆయనను 108ద్వారా కుప్పం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను గుర్తించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కడుపు నొప్పి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పోలీసుల కథనం మేరకు మండలంలోని బొమ్మరాజుపల్లికు చెందిన చంద్రశేఖర్ (40) తరచూ కడుపునొప్పితో బాధపడేవాడు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో కడుపునొప్పి తీవ్రం కావడంతో భార్యను వేడి నీళు పెట్టివ్వాలని కోరాడు. వేడి నీరు తాగిన కడుపునొప్పి తగ్గకపోవడంతో మనస్థాపానికి గురై సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ చంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో ఓ వృద్ధుడు, చంద్రగిరి మండలంలో మరో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు శుక్రవారం చోటుచేసుకున్నాయి.

గూడూరు పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గూడూరు ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు కథనం మేరకు 60 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు సమాచారం అందించారన్నారు. వెళ్లి పరిశీలించగా మృతుడు బ్లూ కలర్ చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చంద్రగిరిలో..

రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, రాయలపురం పంచాయతీలో గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచా రం అందించారు. పోలీసుల కథనం మేరకు.. రాయల్ పురం సమీపం లోని భారీ వృక్షంపై ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెట్టు ఎక్కి 20 అడుగుల ఎత్తులో దారం కట్టుకుని ఉరి వేసుకుని దూకి ఆత్మహత్య చేసుకున్నాడని కపోలీసులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. యువకుడికి సంబంధించి వివరాలు తెలిసినవారుతమకు సమాచారం ఇవ్వాలని చంద్రగిరి పోలీసులు తెలిపారు.

తిరుమల బస్సు సర్వీస్‌లు ప్రారంభానికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు – తిరుమల బస్ సర్వీసులను త్వరలో తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రయాణికులకు హామీ ఇచ్చారు. గూడూరు ఆర్‌టిసి డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన గూడూరు–పొదలకూరు మూడు బస్సు సర్వీసులను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. గూడూరు – పొదలకూరు నూతన బస్సు సర్వీసులను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు తిరుమల బస్ సర్వీసులు వైసిపి పాలనలో ఎత్తివేయడం దారుణమని తిరిగి గూడూరు తిరుమల బస్ సర్వీస్ అందుబాటులోకి తీసుకొస్తామని అందుకు సంబంధించి సంబంధిత



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

అధికారులు మంత్రితో చర్చిస్తామని పేర్కొన్నారు. అన్ని బస్సులు గూడూరు పట్టణంలోకి వచ్చే విధంగా డిపో మేనేజర్ చొరవ చూపాలని తాను కూడా ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని తెలిపారు. గూడూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అధికారులు చొర వ చూపాలని అవసరమైన మేర కు తమ నాయకులు సహకరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్, సిబ్బంది, టీడీపీ నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, వాటం బేడు శివ కుమార్, రహీమ్ పాల్గొన్నారు.

వీధి శునకాలు పట్టివేత

ప్రజాశక్తి - పుత్తూరు : పుత్తూరు పురపాలక సంఘం కమిషనర్ ఎం మంజునాథ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలో ప్రజల సమస్యల పరిష్కారంపై, ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించారు. వీధి కుక్కలను అరికట్టేందుకు ప్రభుత్వ నిధులతో తిరుపతి బ్లూ అనిమల్ కేర్ ద్వారా వీధి శునకాలను పట్టివేశారు. పట్టణంలోని 24 వ వార్డు పరిధిలోని రామనాథ శెట్టి వీధి, కావమ్మ గుడి వీధి, బెస్త వీధి, 25 వ వార్డు పరిధిలోని కాపు వీధి, 26 వ వార్డు పరిధిలోని ధర్మరాజుల గుడి ఏరియా, రాజాజీ వీధిలోని వీధి కుక్కలను పట్టి తిరుపతి బ్లూ అనిమల్ కేర్ కి పంపించి వాటికి స్టెరిలైజేషన్ చేసి రాబిస్ టీకా వేయించి తిరిగి అదే స్థానంలో వదలాలని



నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ ఎ హరి, టిడిపి ప్రతినిధులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శీను బాబు, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మేస్త్రీలు, వార్డు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.